# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు.**

**3.** **ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే రైతు నేస్తం లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

**4.** **ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని ఆంధ్రపదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.**

==========================

ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి ఆర్టీజీఎస్ ద్వారా నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో మరోమారు సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని, ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయాలని సూచించారు. మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమం నిమిత్తం సాయంత్రం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

హైదరాబాదులోని సచివాలయం నుంచి నిన్ననిర్వహించిన రైతు నేస్తం దృశ్యమాధ్యమ సమావేశంలో ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే రైతు నేస్తం లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను ఈ సందర్భంగా మంత్రి తెలుసుకున్నారు.

-------------------------

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో నిన్న భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన భేటీలో నేరడి ప్రాజెక్టు గెజిట్ నోటిఫికేషన్ ను ముఖ్యమంత్రికి, కేంద్రమంత్రి అందజేసి అందులోని వివరాలను వెల్లడించారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ జారీ చేసిన నేరడి ప్రాజెక్టు గెజిట్ నోటిఫికేషన్ ఒక చరిత్రాత్మక ఘట్టంగా ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఈ సమస్యపై పోరాటం చేస్తున్న శ్రీకాకుళం ప్రజలకు, ముఖ్యంగా సాగునీటి, నీటి భద్రత కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఇది గొప్ప శుభవార్తగా నిలిచిందన్నారు. నేరడి ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మాణం వైపు అడుగులు వేస్తుందన్నారు.

-------------------------

రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయం లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చమురు సంస్థల రాష్ట్ర సమన్వయకర్త ఎన్. భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని హెచ్. పి.సి. ఎల్. రిటైల్ ప్రాంతీయ కార్యాలయంలో అయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ నిర్మూలించేందుకు ఇప్పటికే ఒక వెయ్యి 79 దాడులు చేసి, 4వేల 8 వందల సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు సరిపడా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

-------------------------

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర రాష్ట్రానికి ఉందన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతితో పాటు, ప్రధాన నగరాల్లో అధిక అంతస్తుల భవనాలు నిర్మాణమవుతున్నాయని, వాటికి అనుగుణంగా అగ్నిమాపకశాఖ అవసరమైన ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సూచించారు.

-------------------------

ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని ఆంధ్రపదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనట్లు చెప్పారు. జలధార కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా, చాలకూరు గ్రామ చెరువు పూడికతీత పనులను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇప్పటివరకూ ప్రజా ప్రభుత్వం కల్పించిన ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో ఉద్యోగాల కల్పనపై నిన్న నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ మాదిరిగానే ప్రతి ఒక్క ఉద్యోగాన్ని ఆధార్, కేవైసీ అనుసంధానంతో ట్రాక్ చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువును వచ్చె నెల 4వ తేదీ వరకూ పొడిగించినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కందులు కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తిని పరిశీలించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా కృషి చేస్తున్నారని మంత్రి వెల్లడించారు.

---------------------------

భారత ప్రభుత్వ కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ ఈ రోజు విశాఖపట్టణం జిల్లాలో పర్యటించనున్నట్లు జాతీయ గణాంక కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర కార్యదర్శి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

---------------------------

దక్షిణ కోస్తా ఆంధ్ర, పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడినట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ తెలంగాణ, పరిసర ప్రాంతాలలోని మరో ఉపరితల ఆవర్తనం కూడా బలహీనపడిందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు. దీని ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

మరొవైపు తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం పేర్కొంది.

====================